

సాక్షి
బాపట్ల
శనివారం । 5 । అక్టోబర్ । 2024



పులిచింతల నీటినిల్వ
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 31,897 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 29,898 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 588.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,822 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గజలక్ష్మీదేవీగా అమ్మవారు


క్రోసూరు: క్రోసూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరీఅమ్మవారు శుక్రవారం గజలక్ష్మీ దేవీగా భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. మహిళలు సాయంత్రం బతకమ్మ ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

న్యూస్‌రీల్

పాత విద్యుత్ స్తంభాలను మార్చుతాం


కారంచేడు: దశాబ్దాల కాలం క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. శుక్రవారం మండల కేంద్రమైన కారంచేడు రెండు చెరువుల మధ్యన కేంద్ర ప్రభుత్వంతోపాటు, ఓఎన్‌జీసీ నిధులతో సుమారు రూ 3.05 కోట్లతో నిర్మించనున్న కమ్యూనిటీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ మొదటి దశ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పర్చూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎప్పుడో వేసిన విద్యుత్ స్తంభాలు రోడ్డుకు దిగువన ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, స్థానికులు తనకు వినతిపత్రం అందించారని మంత్రి చెప్పారు. కొత్తవి ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ.. సొంత ఊరి సమస్యల పరిష్కారంలో తాను, తన కుటుంబ సభ్యులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వాడరేవు నుంచి పిడుగురాళ్ల జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీలను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కలెక్టర్ జె.వెంకట మురళి, రాంకీ ప్రతినిధి రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ బాలిగ శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఎస్పీకి అవార్డు


నగరంపాలెం: జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌కు బెస్ట్ డీజీపీ డిస్క్ అవార్డును రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ అవార్డును జిల్లా ఎస్పీకి అందించారు.

క్రైం ఏఎస్పీగా సుప్రజ


నగరంపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ఐదుగురు ఏఎస్పీలను బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఏసీబీ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కె.సుప్రజను గుంటూరు జిల్లా ఏఎస్పీ (క్రైం)గా బదిలీ చేశారు. గతంలో ఆమె గుంటూరు జిల్లా ఏఎస్పీ (పరిపాలన)గా, గుంటూరు పశ్చిమ, గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. ఇక గుంటూరు జిల్లా లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ కొల్లి శ్రీనివాస రావు.. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు.

రేంజ్‌లో ఇద్దరు డీఎస్పీలు బదిలీ
నగరంపాలెం: రాష్ట్రంలో 14 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా ఉమెన్ పీఎస్ డీఎస్పీ ఎ. శ్రీనివాసరావును బాపట్ల జిల్లా రేపల్లె సబ్ డివిజన్‌కు, బాపట్ల జిల్లా రేపల్లె సబ్ డివిజన్ డీఎస్పీ టి.మురళీకృష్ణను గుంటూరు జిల్లా తుళ్ళూరు డీఎస్పీగా బదిలీ చేశారు.

డిప్యూటీ సీఎం కార్యాలయం ఎదుట ఆందోళన


మంగళగిరి: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆప్కాస్ ఉద్యోగులు గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. తమకు జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాల పోషణ కష్టంగా మారిందన్నారు. ఎన్నిసార్లు ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని తమ ఇబ్బందులు తీర్చకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

ప్రసాదంపై రాజకీయం తగదు


టీడీపీ చివరకు దేవుడి ప్రసాదాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలనే పరిస్థితికి దిగజారింది. సాక్షాత్తు కలియుగ దైవం వెంకటేశ్వరుని పవిత్ర ప్రసాదం తయారీలో వాడే నెయ్యిని కల్తీ చేశారంటూ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోంది. వారు చేసిన తప్పులను కప్పి పుచ్చే దురాలోచనతో టీడీపీ పన్నిన పన్నాగం ఇది. వారికి స్వామివారే తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయి. ఇంతకు ఇంత అనుభవించక తప్పదు. భక్తుల మనోభావాలతో ఆటలాడుకోవడం దుర్మార్గం.

– వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పాణెం చిన హనిమిరెడ్డి

కూటమికి మొట్టికాయ


పవిత్రమైన వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన దుష్ప్రచారంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బాగుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకంగా దేవుడి ప్రసాదంపై దుష్ప్రచారం చేస్తున్నారు. సుప్రీం ఏర్పాటు చేసిన సిట్‌తో తగిన న్యాయం జరిగే అవకాశం ఉంది. నిజం నిదానంగా తెలుస్తుందని.. అదే విధంగా ప్రభుత్వ వక్రబుద్ధి ఇప్పుడు బయటికి వస్తోందన్నారు. ఎలాంటి విచారణ జరపకుండా కల్తీ జరిగిందని చెప్పడం విడ్డూరం.

– వరి కూటి అశోక్‌బాబు, వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి

కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం


శ్రీవారి లడ్డూ ప్రసాదంపై చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు. దీన్ని స్వాగతిస్తున్నాం. రాజకీయ స్వార్థం కోసం చంద్రబాబు శ్రీవారి ప్రసాదంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. సూపర్-6 హామీలను అమలు చేయలేక ప్రజల ఆలోచనలను మళ్లించేందుకే తన ఎల్లో మీడియా అండదండలతో గత ప్రజాప్రభుత్వంపై బాబు విమర్శలు గుప్పిస్తున్నారు. లడ్డూ ప్రసాదంపై చేసిన వ్యాఖ్యలతో శ్రీవారి భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా చంద్రబాబు హామీలను అమలు చేయాలి..

– డాక్టర్ గణేష్, రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త

మాదే నైతిక విజయం


తిరుమల లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు సిట్‌ను ఏర్పాటు చేయడం వైఎస్సార్ సీపీకి నైతిక విజయం. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో ఏర్పాటు కాబోయే సిట్‌తో ప్రసాదం విషయంలో అసలు వాస్తవాలు బయటకు వస్తాయి. టీడీపీ రాజకీయం చేయాలని చూసిందని, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించడం వైఎస్సార్ సీపీకి శుభపరిణామంగా మారింది.

– కరణం వెంకటేష్, చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి

అబద్ధాల బాబుపై స్వామి ఆగ్రహం


స్వార్థ రాజకీయాల కోసం దేవుడిని వాడుకునేందుకు ప్రయత్నించిన చంద్రబాబుకు తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టులాంటిది. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ప్రచారం చేసి, ఆ నిందను రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వేసే ప్రయత్నం చేశారు. ఏది చెప్పినా నిజం అని ప్రజలు నమ్ముతారనే భావనలో చంద్రబాబు ఉన్నారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టులాంటిది. అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజం చేయాలని చూసే చంద్రబాబు.. సాక్షాత్తు వెంకటేశ్వరస్వామి విషయంలో ఇలా ప్రచారం చేసి ఆయన ఆగ్రహానికి బాబు గురయ్యారు.

– కోకి రాఘవరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల మండల అధ్యక్షుడు

సత్యమేవ జయతే



తిరుమల లడ్డూ కల్తీ డ్రామాకు సుప్రీంకోర్టు చెక్

- సీఎం వేసిన సిట్‌ను రద్దు చేసిన న్యాయస్థానం
- సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేక సిట్ ఏర్పాటు
- పొలిటికల్ డ్రామాలు చేయొద్దని బాబుకు హెచ్చరిక
- దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని మొట్టికాయలు
- సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్న శ్రీవారి భక్తులు
- సీబీఐ పర్యవేక్షణలో దర్యాప్తుపై సర్వత్రా హర్షం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: తిరుమల లడ్డూ కల్తీ జరిగిందంటూ ప్రచారం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తిరుమల లడ్డూలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జంతువుల కొవ్వు కలిపిందంటూ తప్పుడు ప్రచారానికి దిగిన కూటమి సర్కార్‌కు అత్యున్నత న్యాయస్థానం చెంప చెళ్లుమనేలా తీర్పునిచ్చింది. తాను చేసిన ఆరోపణలపై మళ్లీ చంద్రబాబే విచారణకు సిట్‌ను నియమించారు. కూటమి సర్కార్ కుట్రపూరిత ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేరుగా సుప్రీం కోర్టుకు వెళ్లింది. అన్నీ గమనించిన న్యాయస్థానం.. ఎట్టకేలకు బాబు వేసిన సిట్‌ను రద్దు చేసింది. స్వయంగా సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో అయిదుగురితో కూడిన స్వతంత్ర సిట్‌ను నియమించింది. లడ్డూ కల్తీ ఆరోపణల వ్యవహారంపై ఇది దర్యాప్తు చేసి నివేదిక సమర్పించనుంది. సుప్రీం తీర్పును అన్నివర్గాల వారు స్వాగతిస్తున్నారు. నిష్పాక్షిక దర్యాప్తుతోనే ఈ వివాదం సమసిపోతుందని అందరూ భావిస్తున్నారు. తిరుమల లడ్డూను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్తీ చేసిందని, లడ్డూలో జంతువుల కొవ్వు వాడారని భక్తుల మనస్సు గాయపడేలా కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారానికి దిగింది. ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు దీనికి సంబంధించి విమర్శలు చేశారు. వారిని అనుకరిస్తూ కూటమి పార్టీల నేతలు నోరు పారేసుకున్నారు. ఆధారాలు లేకుండా విమర్శలు చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీయడంపై అన్నివర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఎటువంటి ఆధారాలు లేకుండా తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కల్తీ అంటూ ఎలా మాట్లాడతారని విమర్శలు వచ్చాయి. పైగా జూలై నెలలో వచ్చిన రిపోర్టులు రెండు నెలలు దాచి.. సెప్టెంబర్‌లో వంద రోజుల పాలన నేపథ్యంలో నెయ్యి కల్తీ అంటూ బాబు ఆరోపణలకు దిగడం చర్చనీయాంశంగా మారింది. దీని వెనుక రాజకీయ కుట్ర ఉందని అందరూ భావించారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన ముగిసినా ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విపక్షం సంగతి దేవుడెరుగు.. స్వపక్షం నుంచే విమర్శలు మొదలయ్యాయి. ఓట్లేసిన జనంలో తీవ్ర వ్యతిరేకత పెల్లుబికింది. ప్రతిపక్షాల నుంచి నిలదీతలు మొదలయ్యాయి. దీని నుంచి బయట పడేందుకు బాబు సర్కార్ తిరుమల లడ్డూ కల్తీ అయ్యిందంటూ తప్పుడు ప్రచారాన్ని తెరపైకి తెచ్చిందని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తోంది. కల్తీపై ఆధారాలు లేకపోయినా రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ముఖ్యమంత్రి ఎలా మాట్లాడతారని విమర్శలు చేసింది. పైగా విచారణ కోసం సీఎం సిట్‌ను నియమించడంతో.. కల్తీ జరిగిందని ఆయనే ప్రకటించినందున ఆ ప్రభావం సిట్ పై పడి దర్యాప్తు ఎలా నిష్పాక్షికంగా సాగుతుందని అన్ని వర్గాలనుంచి విమర్శలు వచ్చాయి. దీంతో వైఎస్సార్‌సీపీ నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. న్యాయస్థానం శుక్రవారం చంద్రబాబు వేసిన సిట్‌ను రద్దు చేసింది. ఆయన కూటమి సర్కార్‌కు చెంపపెట్టులాంటి తీర్పునిచ్చింది. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని హెచ్చరించింది. పొలిటికల్ డ్రామాలు చేయవద్దని మొట్టికాయలు వేసింది. కలియుగ దైవం వెంకటేశ్వరస్వామితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ క్రీడలకు తెగబడడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుప్రీం తీర్పును అన్ని వర్గాల వారు స్వాగతిస్తున్నారు.

ఈఓ మాటలను వక్రీకరించిన బాబు


చంద్రబాబుకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు. టీటీడీ ఈఓ శ్యామలరావు ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం కల్తీ ఉందని గమనించిన నెయ్యి లారీలను వెనుక్కు పంపించారు. ఆయన క్లియర్‌గా చెప్పినా ఆ మాటలను వక్రీకరిస్తూ చంద్రబాబు తిరుమల లడ్డులో కల్తీ జరిగిందని తిరుమలేశుడిని కూడా తన రాజకీయాలకు వదల్లేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీక్ష పేరిట మత విద్వేషాలను రెచ్చగొట్టారు. పవన్ కళ్యాణ్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి.

– సునీల్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు

సుప్రీంకోర్టు తీర్పు శుభదాయకం


లడ్డూ అపవిత్రం అయిందంటూ వచ్చిన ఆరోపణలు తీవ్ర బాధ కలిగించే విషయం. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా జరిగిన ఈ ఘటనపై స్పందించిన సుప్రీం కోర్టు సిట్ ఏర్పాటు చేయడం సంతోషకరం.

– పరాశరం రామాచార్యులు, రామాలయం అర్చకులు

న్యాయస్థానం తీర్పు హర్షణీయం


లడ్డూ వివాదంపై సుప్రీం ఇచ్చిన తీర్పు హర్షణీయం. దేవుళ్లను రాజకీయాలలోకి తేవడం సరైన విధానం కాదనడం. దర్యాప్తునకు సిట్ ఏర్పాటు ఆమోదయోగ్యమే. సుప్రీంకోర్టు సరైన తీర్పు ఇచ్చింది.

– తోకల కృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పర్చూరు

మంచి నిర్ణయం


తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు చేసిన ఆరోపణలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బాగుంది. స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని తేల్చిచెప్పింది. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఐదుగురితో దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం.

– ఆసోది బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, చినగంజాం

తీర్పుతో భక్తుల్లో ఆనందం


వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై నడుస్తున్న వివాదంలో సుప్రీంకోర్టు తీర్పుపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్ ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. భక్తులు ఎంతో సంతోషంగా ఉన్నారు. దర్యాప్తులో నిజాలు బయటకు వస్తాయి.

– దిట్టకవి వాసుదేవాచార్యులు, అర్చక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ధాన్యం సేకరణకు అధికారులు సిద్ధం కావాలి

జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి

బాపట్ల టౌన్: ధాన్యం సేకరణకు అధికారులు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ధాన్యం సేకరణపై అనుబంధ శాఖల అధికారులతో శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు నష్టం జరిగితే సహించేబోమన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు. నవంబర్ నుంచి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలో 2.17 లక్షల ఎకరాలలో ధాన్యం పంటలు సాగు అవుతున్నాయని పేర్కొన్నారు. సగటున 5.64 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. జిల్లాలో కనీసం 50 వేల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. 57 రైస్ మిల్లులు ఉన్నాయని తెలిపారు. ధాన్య సేకరణకు క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పథకంతో మేలు
కారంచేడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పథకం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవలో మాట్లాడారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కంటైనర్‌ని ఢీ కొన్న తుఫాన్

నలుగురికి తీవ్రగాయాలు

ఉలవపాడు: దైవదర్శనానికి తిరుపతి వెళ్తుండగా ప్రమాదవశాత్తు టైరు పంక్చరై హోటల్ వద్ద ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీ కొన్న ఘటన జాతీయ రహదారిపై మండల పరిధిలోని వీరేపల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు.. బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన 11 మంది కుటుంబ సభ్యులు తిరుపతి దైవదర్శనానికి బయలుదేరారు. తుఫాన్ వాహనంలో వెళ్తున్న సమయంలో వీరేపల్లిలోని నిర్విఘ్న హోటల్ వద్దకు వచ్చేసరికి ముందు టైరు పంక్చరై హోటల్ వద్ద ఆగి ఉన్న కంటైనర్ లారీని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సునీల్‌కు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్ పక్కన కూర్చున్న శ్రీనివాస్‌తో పాటు మరో వ్యక్తి, చిన్న పాపకు తీవ్రగాయాలయ్యాయి. వెనుక కూర్చుని ఉన్న సన్నిబోయిన శ్రీను, కోటేశ్వరమ్మ, అయనప్ప, చిన్నమ్మ, రావులపల్లి శ్రీను, పద్మ, నాగజ్యోతికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన నలుగురిని 108 వాహనంలో, స్వల్పగాయాలు అయిన ఏడుగురిని హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. తుఫాన్ ముందు భాగం కంటైనర్ లారీ వెనుక ఇరుక్కుపోయింది. డ్రైవర్‌తోపాటు ముందు కూర్చున్న వారిని స్థానికులు వెనుక సీట్లు తొలగించి బయటకు తీశారు. లారీ అడ్డంగా లేకపోతే ఈ తుఫాన్ వాహనం నేరుగా హోటల్‌లోకి వెళ్లేదని స్థానికులు తెలిపారు. రోడ్ సేఫ్టీ పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో పంపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కంటైనర్‌ను ఢీ కొట్టిన వాహనం



ఇరుక్కున్నవారిని బయటకు లాగుతున్న స్థానికులు

నల్లమడపై నిర్లక్ష్యపు నీడ!

- కింది పొలాలకు అందని సాగునీరు
- లక్ష ఎకరాల ఆయకట్టులో సగమే సాగు
- ఇప్పటికే ఎండిపోయిన నారుమళ్లు
- పాలకుల తీరుపై అన్నదాతల ఆగ్రహం



నీరందక ఎండిపోయిన పొలం

చీరాల: కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులు రోజూ కన్నీరు పెడుతున్నారు. నీరు ఉన్నా కూడా అందించలేని దౌర్భాగ్య ప్రభుత్వం ఇదని వారు దుమ్మెత్తి పోస్తున్నారు. కొమ్మమూరు ఆయకట్టు పరిధిలో అధికారంగా 75 వేలు, అనధికారకంగా 25 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని ఈ ఆయకట్టు కింద సదరు భూములు ఉన్నాయి. కొమ్మమూరు కెనాల్ నుంచి సాగునీరు అందాలి. ఈ ఏడాది రబీ సీజన్ వచ్చినా రైతులు పంటలు వేయడం ప్రశ్నార్థకంగా మారింది. నల్లమడ లాకుల వద్ద నుంచి అవసరమైన సాగునీరు సరఫరా కావడం లేదు. దీనికి తోడు కాలువల పూడికతీత పనుల్లో అక్రమాలు చోటుచేసుకోవడంతో నామమాత్రంగా పనులు చేపట్టారు. దీంతో నల్లమడ లాకుల వద్ద నుంచి సాగునీరు కిందకు రాకపోవడంతో ఆయకట్టు కింద ఉన్న కారంచేడు, చీరాల, వేటపాలెం, చినగంజాం, నాగులుప్పలపాడు మండలాల్లో నారు వేసిన కొద్ది రోజులకే పొలాలు ఎండి పోతున్నాయి. పాలకులు నిర్లక్ష్య వైఖరితో రైతుల సమస్యల పట్టించుకోవడం లేదు. సాగునీటి సమస్య అధికమైంది. గుంటూరు జిల్లాలోని నల్లమడ లాకులపై ఇంకా పంట సాగు చేయడం వల్ల కూడా నీరు కిందికి రావడం లేదు. నాకాబందీ తీరును వినియోగించి సాగునీరు అందించాలని రైతులు పేర్కొన్నారు. చిట్టివాద, దరివాద, కారంచేడు, వేటపాలెం మండలాల్లో కూడా పంటలు ఎండుతున్నాయి.

పూడికతీతలో అక్రమాలు..
స్టువర్టుపురం చానల్ పొడవు 18 కిలోమీటర్లు. కొద్దిరోజుల కిందట రూ.9 లక్షలతో పూడిక తీయించామని అధికారులు చెబుతున్నారు. పరిస్థితి మాత్రం అలా కనిపించడం లేదు. నీటి పారుదలకు అడ్డుగా ఉన్న గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు, గట్లు మీద చెట్లు వంటి వాటిని కూడా తొలగించలేదు. బడా రైతులు కొందరు కాలువకు అడ్డుకట్ట వేసి తమ పొలాలకు నీరు మళ్లించుకుంటున్నారు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. మిగతా రైతులు దీనిపై ఆందోళన చెందుతున్నారు. స్టువర్టుపురం కాలువ ఆయకట్టులో వేసిన పొలంలో నారుమడికి నీరందక పగుళ్లు వచ్చాయి. చీరాల నియోజకవర్గంలో పేరాల – చీరాల చిట్టివాద రైతు సంఘం పరిధిలో ఈ చానల్ కింద దాదాపు మూడు వేల ఎకరాలున్నాయి. ఏటా ఈ ప్రాంత రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రస్తుత సీజన్‌లో 20 రోజుల క్రితం నారుమళ్లు పోశారు. కానీ కాలువలోకి నీరు అరడుగు కన్నా పారడం లేదు. ఫలితంగా దిగువన నారు పోసినవి ఎండిపోతున్నాయి. కొందరైతే ఇంజిన్లు పెట్టి తడుపుకొంటున్నారు. ఆర్థిక స్థోమత లేని వారు బక్కెట్లు తెచ్చి నీరు చల్లుకునే పరిస్థితి ఉంది. దీనిపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిట్టివాద పరిధిలోని భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల చిట్టివాద, దరివాద అన్నదాతలు చీరాల ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తర్వాత ఆర్డీఓకు వినతిపత్రం కూడా అందించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ఇటీవల నిరసన తెలుపుతున్న రైతులు

నారు మడులు ఎండిపోతున్నాయి


స్టువర్టుపురం చానల్‌కి సాగునీరు అందడం లేదు. ఏటా ప్రతి సీజన్‌లో ఇదే పరిస్థితి ఎదురవుతోంది. నారుమళ్లు పోసి రోజులు గడుస్తున్నా పొలాలకు నీరందక ఎండిపోతున్నాయి. పోసిన నారును బతికించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం.

– మచ్చా వీరరాఘవులు, రైతు

ఖర్చు పెడుతున్నా ప్రయోజనమేదీ?


సాగుకు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్నా సకాలంలో నీరందక పంట నిలవడం లేదు. స్టువర్టుపురం చానల్‌లో పిచ్చి మొక్కలు, గుర్రపుడెక్క, నాచు ఎక్కువగా ఉంది. నీటి పారుదలకు అవరోధాలు ఏర్పడుతున్నాయి. అధికారులు కూడా చానల్ ఆధునికీకరణకు చర్యలు తీసుకున్నామని చెబుతున్నా ఫలితం ఉండడం లేదు.

– మాధవరావు, రైతు

క్లుప్తంగా

నేడు రాష్ట్ర ఖోఖో జట్ల ఎంపిక

జే.పంగులూరు: నేడు స్థానిక మాగుంట సుబ్బ రామిరెడ్డి బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో రాష్ట్ర ఖోఖో జట్టు ఎంపిక జరుగుతుందని ఖోఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖేలో ఇండియా జూనియర్, సబ్‌జూనియర్ సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు (బాలబాలిలకు మాత్రమే) తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్ పట్టణంలో ఈ నెల 16,17,18 తేదీలలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. మన రాష్ట్రం నుంచి బాలబాలికలు అండర్-14, అండర్-17 విభాగంలో జట్టు ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ ఎంపికలో 13 జిల్లాల నుంచి బాలబాలికలు హాజరవుతారని, సుమారు 100 మంది పాల్గొంటారని చెప్పారు. వీరిలో అండర్-14 విభాగంలో 15 మంది, అండర్-17 విభాగంలో 15 మందిని ఎంపిక చేయనున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె భాస్కరరావు, బీ కాశీ విశ్వనాథ్ తెలిపారు. ఎంపికైన వారికి 10 రోజుల పాటు కోచింగ్ క్యాంపులు నిర్వహించి కోయంబత్తూరు జరిగే జాతీయ స్థాయి సౌత్ జోన్ ఖేలో ఇండియా ఖోఖో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలో జిల్లా ఖోఖో కోచ్‌లు, పీడీలు, వివిధ జిల్లాల కార్యదర్శులు పాల్గొంటారని ఆయన ప్రకటనలో తెలిపారు.

బాపట్ల డీపీవోగా కె.ఎల్. ప్రభాకరరావు



బాపట్లటౌన్: జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)గా కె.ఎల్. ప్రభాకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా నుంచి బదిలీ పై బాపట్లకు వచ్చిన ప్రభాకరరావు డీపీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన గ్రామాలను తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానన్నారు. నూతన డీపీఓకి బాపట్ల ఇన్చార్జి డీఎల్‌పీవో పులి శరత్ బాబు, ఈస్ట్ బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, కార్యాలయ సిబ్బంది డీపీవోకు శుభాకాంక్షలు తెలిపారు.

క్షయ, కుష్ఠు వ్యాధి నివారణపై శిక్షణ

గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లాలోని పట్టణ ప్రాథమిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల 25 మంది వైద్యాధికారులకు క్షయ వ్యాధి నివారణ, కుష్ఠు వ్యాధి నియంత్రణపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ క్షయవ్యాధి నివారణ, నియంత్రణ కార్యక్రమాల గురించి జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు నిర్వహించి ఆయా వ్యాధుల నివారణపై దృష్టి సారించడం జరిగిందన్నారు. క్షయ, కుష్ఠువ్యాధి సంబంధించి యాప్స్ అప్డేషన్స్, వాటిని వినియోగంపై వైద్యాధికారులకు వివరించారు. మొదటిరోజు మొత్తం 25 మంది వైద్యాధికారులు శిక్షణ కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. శనివారం 80 మంది(ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల) వైద్యాధికారులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించనున్నారు.

కష్టపడే కార్యకర్తల కోసం గ్రీన్ బుక్

- అధికారంలోకి రాగానే వారికి తగిన ప్రాధాన్యం
- పదవీ స్వీకార సభలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి
- మా వారిపై దాడి చేసే ప్రత్యర్థుల కోసం బ్లడ్ బుక్ రాస్తాం
- గుంటూరు, నరసరావు పేట పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు మోదుగుల హెచ్చరిక



అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

పట్నంబజారు / నెహ్రూనగర్ : పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తల కోసం తాను గ్రీన్ బుక్ రాస్తానని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అంబటి రాంబాబు స్పష్టం చేశారు. శుక్రవారం గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డి పదవీ స్వీకార సభ జరిగింది. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా అంబటి, మోదుగుల మాట్లాడారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటానని అంబటి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తోందని, తాము గెలిస్తే బ్లడ్ బుక్ రాస్తామని గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి హెచ్చరించారు. అంతకుముందు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా కార్యకర్త మాదిరిగా పనిచేసుకుంటూ ముందుకు సాగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు ప్రసంగించారు.

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్‌సీపీ కేడర్‌కు మనోధైర్యాన్ని కల్పించి ముందుకు తీసుకెళ్లే సత్తా అంబటికి, మోదుగులకు ఉందన్నారు. పార్టీకి దూరమైన వారిని కూడా దగ్గర చేసే దిశగా ప్రతి ఒక్కరూ సాగాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఓడిన వారం రోజుల్లోనే ప్రజా సమస్యలపై రోడ్డెక్కిన ఘనత వైఎస్సార్ సీపీ కార్యకర్తలకే చెందుతుందన్నారు. వారికి ఎటువంటి కష్టం వచ్చినా తోడుగా నడిచేందుకు పార్టీ నాయకత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ సుదీర్ఘ అనుభవం ఉన్న నేతలకు సముచిత స్థానం కల్పించి పార్టీని బలోపేతం చేసే దిశగా తీసుకున్న నిర్ణయం సంతోషకరమన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ పాలన పక్కన పెట్టి కేవలం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టార్గెట్ చేస్తూ టీడీపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ ఓడిపోలేదని, మోసపోయిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త ఈ విషయం గ్రహించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన 5 ఏళ్ల పాలనలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ రెండింటిని నిర్వీర్యం చేస్తోందన్నారు. వైద్యాన్ని ప్రైవేట్ పరం చేయడం తగదన్నారు. పార్టీ నేత పూనూరి గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ వంద రోజుల పాలనలో 60 మందిని పొట్టనబెట్టుకున్న చంద్రబాబుపై 302 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గ్రంథాలయాల మాజీ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు నెలల కాలంలోనే ప్రజలంతా విసుగెత్తిపోయారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ ఇది ఫెయిల్యూర్ ప్రభుత్వమని మండిపడ్డారు. దాదాపు 40 శాతం ఓట్లు ఉన్న జగనన్నకు ప్రజల్లో ఎక్కడా ఆదరణ తగ్గడం లేదని చెప్పారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతురావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పాలన ఈ దేశంలో ఎవరూ అందించలేదన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పార్టీని ఒక తాటిపై తీసుకు వచ్చి విజయానికి కృషి చేద్దామన్నారు. తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. వైఎస్ జగన్ ప్రతి జిల్లా నాయకులతో రివ్యూ మీటింగ్‌లు పెట్టి పార్టీని బలోపేతం చేస్తున్నారని గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో పార్టీని ఈసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. ఇప్పుడు ఎన్నికలు జరిగినా ప్రతి నియోజకవర్గంలో వైఎస్ జగన్‌ను గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఏడు నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి అందరం కలిసి కట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. మచిలీపట్నం పోర్ట్ మాజీ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ మాట్లాడుతూ పార్టీని తిరిగి నిర్మించుకునేందుకు జిల్లా నాయకత్వంతో కలిసి ముందుకు సాగుదామన్నారు. పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దొంతిరెడ్డి, వేమారెడ్డి మాట్లాడుతూ ఈ సభ చూస్తుంటే యుద్ధం ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామని సంకేతం ఇచ్చినట్లు ఉందన్నారు. పార్టీ నేత గంజి చిరంజీవి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల ప్రజల సమస్యలపైనే పోరాటం సాగించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పలు అనుబంధ విభాగాల నేతలు మండేపూడి పురుషోత్తం, సీడీ భగవాన్, పక్కాల సూరిబాబు, వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, మెట్టు వెంకటప్పారెడ్డి, మామిడి రాము పాల్గొన్నారు.

మంచితనాన్ని చేతగానితనం అనుకుంటే పొరపాటే

మంచితనాన్ని చేతగానితనం అనుకుంటే పొరపాటే... ఇకపై ఎవరికి వారే రెడ్‌బుక్ రాసుకోండి. నాలుగు నెల పాలన చూస్తేనే పూర్తిగా టీడీపీ వైఫల్యం అర్థమవుతోంది ప్రతిపక్ష లేకుండా ఎలిమినేట్ చేయాలని దురుద్దేశంతో రాక్షస మూకలు హింసా కాండలు, దౌర్జన్యాలతో పేట్రేగిపోతున్నారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వై.ఎస్.జగన్ ఒక్క కనుసైగ చేసి ఉంటే అసలు ఇవాళ టీడీపీ ఉండేది కాదు. పవిత్రమైన లడ్డూ విషయంలో సుప్రీం కోర్టు చంద్రబాబుకు మొట్టికాయలు వేసింది. పవన్ కళ్యాణ్ తన పార్టీని బీజేపీతో కలిపేసినట్లు ఉన్నారు.

– సజ్జల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నిత్యం అందుబాటులో ఉంటా

ఈ సభ ద్వారానే తాను గ్రీన్‌బుక్ ఓపెన్ చేస్తున్నా. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త పేరు ఆ బుక్‌లో రాస్తా. అధికారంలోకి వచ్చిన తరువాత వారి పేరును వై.ఎస్.జగన్ దృష్టికి స్వయంగా తీసుకెళతా. కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపి ముందుకు సాగే దిశగా అన్ని వేళలా అందుబాటులో ఉంటా. గుంటూరు జిల్లాలో ఎంపీ, ఏడు ఎమ్మెల్యే స్థానాలకు ఎప్పుడు ఎన్నికలు జరిగినా గెలిపించుకునేందుకు మండలస్థాయి నుంచి ప్రతి కార్యకర్తను ఏకం చేసి ముందుకు సాగుతాం.

– అంబటి రాంబాబు వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు

కార్యకర్తల కోసం ఏర్పాటైన సభలా ఉంది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తోంది. మేం అధికారంలోకి రాగానే బ్లడ్ బుక్ రాస్తాం. ఈ సభ పదవీ స్వీకార సభలా కాకుండా.. కార్యకర్తల కేర్ సభలా ఉంది. మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి పథకం కేడర్ చేతుల మీదుగానే ప్రజలకు అందదాలన్న విషయాన్ని వై.ఎస్.జగన్ దృష్టికి తీసుకెళ్తా. సాయం చేసే చేతులు వై.ఎస్.జగన్‌వి. మాయమాటలు చెప్పే నైపుణ్యం చంద్రబాబుది. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పేదల గుండెల్లో ధైర్యాన్ని నింపారు. వై.ఎస్.జగన్ అదే పేదలకు సంక్షేమాన్ని అందజేశారు. నేను రెండు త్రిపుల్ ఆర్ సినిమాలు చూశా. ఒకటి ఎన్టీఆర్ నటించింది కాగా... రెండో సినిమాలో రామోజీరావు, రాధాకృష్ణ, బీఆర్ నాయుడు నటించిన చిత్రం చంద్రబాబు డైరెక్షన్‌లో చూశా. మా వాళ్లపై దాడి చేస్తే బ్లడ్ బుక్‌లో రాయడం ఖాయం. అధికారులు వ్యవహరిస్తున్న తీరును అనుక్షణం గమనిస్తాం.

– మోదుగుల వేణుగోపాలరెడ్డి, గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు

మృతదేహంతో ధర్నా



ధర్నా చేస్తున్న శేఖర్ కుటుంబ సభ్యులు

వేటపాలెం: మహిళ తిట్టి, కొట్టడంతో ఓవ్యక్తి బలవన్మరణం చెందాడు. మృతుడు గిరిజన కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బహుజన, గిరిజన ఐక్యవేదిక అధ్వర్యంలో మృతదేహంతో రోడ్డు మీద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అందిన వివరాల మేరకు.. రామన్నపేట పంచాయతీ వినాయకపురానికి చెందిన గంటా శేఖర్ (35) గురువారం తన ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. అయితే మృతుడు ఓ మహిళతో ఏడాది కాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈక్రమంలో వీరిద్దరి మధ్య రెండు నెలల నుంచి మనస్పర్థలు వచ్చాయి. ప్రతిరోజూ ఇద్దరు గొడవలు పడేవారు. దీంతో ఆ మహిళ తన వద్దకు రావద్దని మృతుడికి చెప్పింది. ఇది భరించలేని గంటా శేఖర్ ఇంట్లో ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, 9 ఏళ్ల కుమారుడు ఉన్నారు. ఆ మహిళ వల్లే శేఖర్ ఉరేసుకున్నాడని ఆరోపిస్తూ బహుజన, గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో మృతదేహంతో కుటుంబ సభ్యులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. దళిత సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు మాట్లాడుతూ శేఖర్ కుటుంబానికి న్యాయం చేయా లని కోరారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు తన సిబ్బందితో వచ్చి నాయకులతో మాట్లాడి ధర్నాని విరమింపజేశారు. ధర్నా కార్యక్రమంలో కట్టా నతానియేలు, దేవరకొండ కోటేశ్వరరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హెడ్ నర్సులుగా పదోన్నతి

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న తొమ్మిది మందికి శుక్రవారం గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు(ఆర్డీ) కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి హెడ్‌నర్సులుగా ప్రమోషన్ ఇచ్చారు. గుంటూరు జీజీహెచ్‌లో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న తుపాకుల కోటేశ్వరి, కొండముడి రత్నకుమారి, నన్నపనేని పద్మజ, గోరంట్ల జ్వరాల ఆస్పత్రిలో పనిచేస్తున్న చిరుతోటి పద్మజాస్మిన్‌లు గుంటూరు జీజీహెచ్‌లో హెడ్‌నర్సులుగా ప్రమోషన్ తీసుకున్నారు. నెల్లూరు గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న పాతూరి ఉమారాణి అదే కళాశాలలో, నెల్లూరు గవర్నమెంట్ కాలేజీలో దార్ల స్నేహలత ఒంగోలు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో, ఒంగోలు గవర్నమెంట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న జూపల్లి మేరి సువార్త కుమారి గుంటూరు జీజీహెచ్‌లో హెడ్‌నర్సులుగా ప్రమోషన్ తీసుకున్నారు.

గుంటూరు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించాలి

- రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- రైల్వే జీఎం సమావేశంలో ప్రతిపాదన



దక్షిణ మధ్య రైల్వే జీఎం సమావేశంలో హాజరైన ఎంపీలు, రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి

లక్ష్మీపురం: గుంటూరు బ్రాడీపేట శంకర్ విలాస్ సెంటర్ ఫ్లైఓవర్ త్వరితగతిన నిర్మాణం చేయాలని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. విజయవాడలోని సత్యనారాయణపురం ఈటీటీ సెంటర్‌లో శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు, గుంటూరు, గుంతకల్లు, విజయవాడ డివిజన్‌ల ఎంపీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు సంబంధించిన ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ మరియు ఇతర సమస్యల సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు బ్రాడీపేట శంకర్ విలాస్ సెంటర్ బ్రిడ్జి 1957లో కేవలం రెండు లైన్ల వెడల్పుతో నిర్మాణం చేయటం జరిగిందని, దాని జీవిత కాలం 65 సంవత్సరాలు పూర్తి అయి సురక్షితమైన స్థితిలో లేదని అన్నారు. ప్రస్తుతం గుంటూరు నగరంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని, ఆ వంతెన స్థానంలో కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) పునఃనిర్మాణం చేయాలని కోరారు. అదే విధంగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణయ్య

అద్దంకి రూరల్: జల్సాలకు అలవాటుపడి డబ్బులు సంపాదించాలని గంజాయి అమ్ముతున్న యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈఘటనపై సీఐ కృష్ణయ్య శుక్రవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. సీఐ వివరాల మేరకు.. తాళ్లూరుకు చెందిన చేజర్ల ఫణిధర్ అద్దంకిలోని బస్టాండ్ వెనుకవైపు హన్విక పెట్ స్పా క్లినిక్ నడుపుతున్నాడు. దేవరకొండ బాల హరీష్‌కృష్ణ అలియాస్ హరీష్ స్పా సెంటర్ పక్కనే టాటూ షాపు నిర్వహిస్తున్నాడు. వీరికి వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో అక్రమ మార్గం ఎంచుకున్నారు. ఈక్రమంలో వీరిద్దరికి తెలిసిన మూడో వ్యక్తి మార్టూరుకు చెందిన బిళ్ల ప్రకాష్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు అద్దంకి వచ్చి గంజాయి అమ్ముతుంటాడు. ఫణిధర్, హరీష్‌లు ప్రకాష్ వద్ద తీసుకుని అమ్మటం, తాగటం చేస్తుంటారు. ప్రకాష్ తన అత్తగారి ఊరు అనకాపల్లి జిల్లా, నర్సీపట్నానికి చెందిన వ్యక్తి ద్వారా గంజాయి తెస్తుంటాడు. ఫణిధర్, హరీష్‌లు ఇద్దరూ ప్రకాష్ వద్ద గంజాయి తీసుకుని చిన్నచిన్న ప్యాకెట్లు కట్టి అధిక మొత్తంలో టాటు షాపు పక్కన ఒక ప్లాస్టిక్ బాక్స్‌లో ఉంచి అమ్ముతున్నారు. వీరి నుంచి సుమారు 13 మంది యువకులు కొనుగోలు చేస్తున్నారు.

విద్యార్థులే టార్గెట్..

అంతేకాకుండా ఈక్రమంలో అద్దంకిలోని పోతురాజు గండి వద్ద మోటార్ మెకానిక్‌గా పనిచేస్తున్న పరుచూరి చందు గంజాయికి అలవాటుపడ్డాడు. బొగ్గులకొండ వద్ద స్వామిజీతో పరిచయం ఏర్పడి అక్కడి నుంచి గంజాయి తాగుతుంటాడు. మిగిలిన వాటిని ఫణిధర్‌కు, హరీష్‌కు విక్రయిస్తుంటాడు. విద్యార్థులను టార్గెట్ చేసుకుని వారితో స్నేహం చేసి గంజాయిని విక్రయిసుంటారు. వీరినే కాకుండా ఈ కేసులో గంజాయి కొనుగోలు చేస్తున్న వారిపై, అమ్ముతున్న వారిపై నిఘా ఉంచినట్లు సీఐ తెలిపారు. త్వరలోనే అందరినీ పట్టుకుంటామన్నారు. గురువారం సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో అద్దంకిలో తన సిబ్బందితో దాడులు జరిపి ఫణిధర్, హరీష్, బిళ్ల ప్రకాష్, చందు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 7200 విలువగల 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో సహకరించిన అద్దంకి ఎస్సైలు ఖాదర్‌బాషా, ప్రవీణ, ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ ఐ.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు జి.అంకమ్మరావు, పి.సాయి కృష్ణారెడ్డి, ఎం.గోపి, ఎస్.నాగరాజులను సీఐ అభినందించారు.

పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్



మాట్లాడుతున్న జేసీ ప్రఖర్ జైన్

బాపట్లటౌన్: పరిశ్రమల స్థాపనకు అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. పరిశ్రమలు, ఎగుమతులపై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి హామీ పథకం కింద పరిశ్రమలు స్థాపించే ఔత్సాహితులను ప్రోత్సహించాలన్నారు. గతేడాదిలో స్థాపించిన పరిశ్రమలకు రాయితీ నగదు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. గడువులోగా దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేసే ప్రక్రియ శరవేగంగా చేపట్టాలన్నారు. సింగల్ డెస్క్ పోర్టల్‌లో 13 దరఖాస్తులు రాగా ఆయా అనుబంధశాఖల నుంచి గడువులోగా 96 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామన్నారు. మిగిలినవి గడువులోగా పరిష్కరించేలా చూడాలన్నారు. మరో ఆరు పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులు ఆయా శాఖల వద్ద పెండింగ్ లో ఉండడంపై వాటిపై ఆరా తీశారు. నిబంధనలు అనుసరిస్తూ పనిచేయాలన్నారు. పీఎంఈజీపీ పథకం కింద 135 దరఖాస్తులు రాగా రూ.3.69 కోట్ల నిధులు మార్జిన్ మనీ కింద ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశ్వకర్మ పథకం కింద చేతివత్తుల వారి నుంచి 35,138 దరఖాస్తులు వచ్చాయన్నారు. 32,487 దరఖాస్తులను మొదటి దశలో పరిశీలించి మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిశీలించాలని ఆదేశించారు. వివిధ ప్రోత్సాహక సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. 350 యూనిట్లకు రూ.7.09 కోట్ల రాయితీతో పాటు వివిధ ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతూ కమిటీ తీర్మానించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రామకష్ణ, ఎల్ డిఎం శివకష్ణ, కమిటీ సభ్యులు భక్తవత్సలం, వివిధ అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వివాహిత ఉసురుతీసిన చున్నీ!

బైక్ చక్రంలో చున్నీ ఇరుక్కుని మహిళ మృతి



సంతమాగులూరు (అద్దంకి): మోటార్ బైక్ చక్రంలో చున్నీ ఇరుక్కొని మహిళ మృతి చెందింది. ఈఘటన సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామ సమీపంలోని పెట్రోలు బంకు వద్ద శుక్రవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. అద్దంకి మండలంలోని మణికేశ్వరం గ్రామానికి చెందిన కరీముల్లా, సాహినా బతుకుదెరువు కోసం మూడేళ్ల క్రితం బల్లికురవ మండలంలోని కొప్పరపాడులో నివాసం ఉంటున్నారు. కరీముల్లా పరదాలు కుడుతూ జీనం సాగిస్తుంటాడు. వీరికి ఇద్దరు పిల్లలు. వారిలో ఒకరికి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో బైకుపై నరసరావుపేట వైద్యశాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో బైకు మండలంలోని ఏల్చూరు గ్రామ సమీపంలోకి రాగానే కరీముల్లా భార్య సాహినా (26) చున్నీ బైకు చక్రంలో ఇరుక్కుపోయి కిందపడి తలకు గాయాలై అక్కడిక్కడే మృతిచెందింది. దీంతో తన భార్య తన కళ్లఎదురుగానే మృతిచెందడంతో కన్నీరు మున్నీరుగా విలపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టు మార్టం కోసం వైద్యశాలకు తరలించారు.

తల్లీబిడ్డల సహా ఆత్మహత్యాయత్నం

నగరంపాలెం: ఆత్మహత్యాయత్నం తల్లి, ఇద్దరు పిల్లలను ప్రాణాలతో రక్షించిన నగరంపాలెం, కంట్రోల్ రూం, తాడేపల్లి ఓపీ పోలీసులను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు. వివరాలు.. గుంటూరు శ్రీనివాసరావుపేట 11వ వీధికి చెందిన షేక్ హసీనా, సుభాని భార్యాభర్తలు. నాలుగేళ్ల క్రితం వారికి పెళ్లి అయింది. ఇద్దరు మగ పిల్లలు. భార్యపై అనుమానంతో భర్త వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో ఆమె పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి భర్త కాపురానికి తీసుకెళ్లక పోగా అనుమానంతో వేధించేవాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇద్దరు పిల్లలతో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనతో శుక్రవారం విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్దకు బయలుదేరింది. ఆమె ఇద్దరు పిల్లలతో వెళ్తూ, పిన్నికి చెప్పింది. పిన్ని హసీనా తల్లి నూర్జహాన్ తెలపగా, వెంటనే నగరంపాలెం పీఎస్ సీఐ వీరాస్వామి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై సీఐ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కి వివరించారు. సత్వరమే కంట్రోల్ రూం, తాడేపల్లి ఓపీ పోలీసులను అప్రమత్తం చేశారు. తాడేపల్లి ఓపీ పోలీసులు సకాలంలో ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. అనంతరం హసీనా, ఇద్దరు పిల్లలను గుర్తించి, ప్రాణాలతో కాపాడారు. ఈలోగా నగరంపాలెం పీఎస్ సీఐ వీరాస్వామి ఘటనా స్థలానికి చేరుకుని, వారిని క్షేమంగా గుంటూరు తీసుకొచ్చారు. జిల్లా ఎస్పీ వద్దకు తీసుకెళ్లగా, తల్లి నూర్జహాన్‌కు కుమార్తె, పిల్లలను అప్పగించారు.

రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

కొరిటెపాడు(గుంటూరు): పంట పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం శనివారం ఒక్కో రైతుకు రూ.2 వేల వంతున విడుదల చేయనుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది రెండవ విడతగా (మొత్తంగా 18వ విడత) సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నాయి. గుంటూరు జిల్లాలో అర్హత కలిగిన 86,674 మంది రైతుల ఖాతాల్లోకి రూ.17.34 కోట్ల పెట్టుబడి సాయం నేరుగా జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తొలి విడతగా గత జూన్ 18వ తేదీన 85,400 మందికి రూ.17.08 కోట్లు ఇచ్చారన్నారు.

బాబూ.. రైతులు గుర్తున్నారా..?

అన్నదాతకు సాయం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎటూ తేల్చడం లేదు. ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని గొప్పగా చెబుతూ 'సూపర్ సిక్స్'తో ఎన్నికల ముందు అదరగొట్టారు. తీరా అధికారం చేపట్టగానే దాని ఊసే ఎత్తడం లేదు. 'అన్నదాత సుఖీభవ' అంటూ పథకం పేరు మార్చి రైతులను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారు. రూ.20 వేలు ఎప్పటి నుంచి ఇస్తారు..? ఎన్ని విడతలుగా అందిస్తారు? పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా ఇస్తారా? రూ.6 వేలు పోను మిగతా రూ.14 వేలు అందిస్తారా? అనేది కూడా స్పష్టం చేయడం లేదు. ఇలా అన్నదాతలను మోసం చేస్తున్నారు.

అన్నదాతలకు వైఎస్ జగన్ చేయూత

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో కరోనా వంటి అత్యంత విపత్కర పరిస్థితుల్లో సైతం రైతులకు అండగా ఉన్నారు. అన్నదాతల కష్టనష్టాల్లో తోడుగా నిలబడ్డారు. ఏటా క్రమం తప్పకుండా జూన్, అక్టోబర్, జనవరి నెలల్లో ప్రతి రైతుకు పీఎం కిసాన్‌తో కలిపి రూ.13,500 చొప్పున జమ చేశారు.